సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

I

శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



ముమ్మరంగా 'ఉపాధి'..
వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన ఉపాధి పనులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. IIలో



మునగతో ప్రయోజనం
మునగ సాగుతో రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్ అన్నారు. IIలో

గరిష్టం / కనిష్టం
31° / 22°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం కొన్ని ప్రాంతాల్లో జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్య కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం వైభవోపేతంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చారు. అక్కడ అర్చకులు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజల్లో ఆలయ ప్రధాన అర్చకుడు విజయరాఘవన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం–జగన్నాథపురం గ్రామాలమధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణపుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. ఆ తర్వాత నివేదన, హారతి సమర్పించి, మంత్రపుష్పం పఠించారు. కార్యక్రమంలో వేదపడింతులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు

జాబ్‌మేళాలో 108 మంది ఎంపిక



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న ప్రతినిధులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఉపాధి కల్పనాశాఖ ఆధ్వర్యాన గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రైవేట్ కంపెనీల బాధ్యులు హాజరై అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారని జిల్లా ఉపాధికల్పనాధికారి కె.శ్రీరామ్ తెలిపారు. మొత్తంగా హాజరైన 256 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

వైద్య కళాశాలకు 60 సీట్లు

కొత్తగూడెంరూరల్: జిల్లా వైద్య కళాశాలకు 60 సీట్లు మంజూరయ్యాయి. ఇందులో పారామెడికల్ విభాగంలో డీఎంఎల్‌టీ 30, డయాలసిస్ 30 సీట్లు ఉన్నాయని ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, సీట్లు పొందిన విద్యార్థులకు నవంబర్ 25 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని వివరించారు. జిల్లా వైద్య కళాశాలలో ఈ ఏడాది మూడో సంవత్సరం 149 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారని ఆయన పేర్కొన్నారు.

ఏజెన్సీలో వైద్యసేవలు అందించాలి

- ఐటీడీఏ పీఓ రాహుల్



విద్యార్థినికి చెక్కు అందచేస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: వైద్య వృత్తి పూర్తి చేశాక ఏజెన్సీ ప్రజలకు వైద్య సేవలను అందించాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ గురుకులాలు, కళాశాలల్లో చదివి నీట్ ద్వారా ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులను పీఓ గురువారం భద్రాచలంలో అభినందించారు. అంతేకాక ఒక్కొక్కరికి ప్రోత్సాహకంగా రూ.50 వేల అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి ఎంబీబీఎస్ సీట్లు సాధించటం అభినందనీయమని, ఇతర విద్యార్థులకు ఆదర్శనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ(జనరల్) డేవిడ్‌రాజ్, సున్నం రాంబాబు, ట్రైబల్ వెల్ఫేర్ ఖమ్మం డీడీ విజయలక్ష్మి, గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావు, ఏసీఎంఓ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ యూనిట్ల బ్యాక్‌డౌన్..



పాల్వంచలోని కేటీపీఎస్ కాంప్లెక్స్

రాష్ట్రంలో విద్యుత్‌కు డిమాండ్ తగ్గడంతో జిల్లాలోని కేటీపీఎస్, బీటీపీఎస్ కర్మాగారాల్లో యూనిట్లను బ్యాక్‌డౌన్‌లో నడపాల్సిన పరిస్థితి నెలకొంది. సామర్థ్యానికి సరిపడా ఉత్పత్తి చేస్తున్నప్పటికీ తగిన వినియోగం లేకపోవడంతో యూనిట్ల నుంచి తక్కువ విద్యుత్‌ను మాత్రమే తీసుకుంటున్నారు. కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో మొత్తం 1,800 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 1,120 మెగావాట్లు, బీటీపీఎస్‌లో 1,080 మెగావాట్లకు గాను 680 మెగావాట్ల విద్యుత్ మాత్రమే వినియోగిస్తుండడం గమనార్హం. అవసరమైనప్పుడు మాత్రమే ఫుల్ లోడ్ తీసుకుని మిగితా సమయాల్లో బ్యాక్ డౌన్‌లో ఉంచుతున్నారు. ఇక కొన్ని యూనిట్లకు సరఫరా అయ్యే బొగ్గులో నాణ్యత లేక ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతోంది. వీటన్నింటి మూలంగా జెన్‌కోకు రూ.కోట్లలో నష్టం వాటిల్లుతోంది. – పాల్వంచ

కేటీపీఎస్‌లో విద్యుదుత్పత్తి సామర్థ్యం
1,800 మెగావాట్లు

ప్రస్తుతం ఉత్పత్తి చేసేది
1,120

బీటీపీఎస్‌లో సామర్థ్యం
1,080

ప్రస్తుత ఉత్పత్తి
680 మెగావాట్లు

కేటీపీఎస్, బీటీపీఎస్‌లో తగ్గిన ఉత్పత్తి

- రాష్ట్రంలోనూ భారీగా తగ్గిన వినియోగం..
- ముందస్తు ఒప్పందం మేరకు ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు
- జెన్‌కోకు రూ.కోట్లలో నష్టం

రోజుకు 16 గంటల పాటు..

విద్యుత్‌కు డిమాండ్ తగ్గడంతో పాటు, బొగ్గు నాణ్యత లోపంతో యూనిట్లలో ఉత్పత్తి తగ్గుముఖం పట్టింది. రోజుకు 16 గంటల పాటు యూనిట్లను బ్యాక్‌డౌన్‌లో ఉంచుతుండడం గమనార్హం. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ కలిగిన కేటీపీఎస్ ఏడో దశ కర్మాగారంలో 800 మెగావాట్లకు గాను ప్రస్తుతం 482 మెగావాట్ల ఉత్పత్తి మాత్రమే వస్తోంది. ఇక్కడికి సింగరేణి నుంచి సరఫరా అయ్యే బొగ్గులో నాణ్యత లోపించింది. గ్రేడ్ 9 రావాల్సి ఉండగా గ్రేడ్ 11, 12 రకం బొగ్గు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో ఆశించిన స్థాయిలో ఉత్పత్తి రావడం లేదు. ఇక కేటీపీఎస్ 5వ దశ కర్మాగారంలోని 9వ యూనిట్‌లో 250 మెగావాట్లకు 180 మెగావాట్లు, 6వ దశలో 250 మెగావాట్లకు 180 మెగావాట్లు, 10వ యూనిట్‌లో 500 మెగావాట్లకు 300 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని మాత్రమే తీసుకుంటున్నారు. మణుగూరు బీటీపీఎస్‌లో 270 మెగావాట్ల సామర్థ్యం గల నాలుగు యూనిట్లలో 150 నుంచి 170 మెగావాట్ల మాత్రమే ఉత్పత్తిని వినియోగిస్తూ.. మిగితా ఉత్పత్తిని బ్యాక్‌డౌన్‌లో ఉంచుతున్నారు. ఉత్పత్తి చాలా తక్కువగా తీసుకుంటుండడంతో జెన్‌కోకు రోజుకు కనీసం రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు నష్టం వాటిల్లుతున్నట్లు సమాచారం.

ఇతర రాష్ట్రాల విద్యుత్ వినియోగం..

ముందస్తు ఒప్పందం మేరకు ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేయక తప్పడం లేదు. రాష్ట్రంలో అవసరానికి మించి విద్యుత్ ఉత్పత్తి అవుతున్నా.. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను వినియోగిస్తూ.. ఇక్కడి ఉత్పత్తిని బ్యాక్‌డౌన్‌లో ఉంచుతున్నారు. రాష్ట్రంలో తక్కువ ధరకు విద్యుత్ ఉత్పత్తి అవుతున్నప్పటికీ.. అత్యవసరాల దృష్ట్యా ఆయా రాష్ట్రాలతో చేసుకున్న ఒప్పందాన్ని పాటించాల్సి వస్తోంది. ఇలా సుమారు వెయ్యి నుండి 3వేల మెగావాట్ల వరకు బయటి విద్యుత్‌ను వినియోగించాల్సి వస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా విద్యుత్‌కు డిమాండ్ తగ్గుతుండడంతో ఉత్పత్తిపై ప్రభావం పడుతోంది. అయితే ఇక్కడి ఉత్పత్తి సామర్థ్యాల అంచనాలను పటిష్టం చేసి ఇతర రాష్ట్రాలతో ఒప్పందాలు తగ్గించుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

లోపించిన బొగ్గు నాణ్యత..

ఇటీవల కర్మాగారాలకు సరఫరా అవుతున్న బొగ్గులో నాణ్యత లోపించినట్లు స్పష్టంగా తెలుస్తోంది. తక్కువ గ్రేడ్ బొగ్గు వస్తున్నా తగు చర్యలు తీసుకోవడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేటీపీఎస్‌లోని మూడు కర్మాగారాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది.

డిమాండ్ లేకపోవడంతోనే బ్యాక్‌డౌన్



రోజుకు రెండు, మూడు గంటలు మినహా మిగితా సమయమంతా యూనిట్లను బ్యాక్‌డౌన్ లోనే ఉంచాల్సి వస్తోంది. రాష్ట్రంలో విద్యుత్‌కు డిమాండ్ తగ్గడం, ముందస్తు ఒప్పందం మేరకు ఇతర సంస్థల విద్యుత్‌ను తీసుకోవడం వల్ల కూడా బ్యాక్‌డౌన్‌లో ఉంచుతున్నాం. అంతేతప్ప మన దగ్గర విద్యుదుత్పత్తికి అవాంతరాలు ఏమీ లేవు.
– ఎం.ప్రభాకర్ రావు, కేటీపీఎస్ 5, 6 దశల సీఈ

'భద్రాచలం'పై దృష్టి పెట్టండి



ఎస్‌సీఆర్ జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ బలరాం నాయక్

- రైల్వే లైన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి
- పగటి వేళ హైదరాబాద్‌కు మరో రైలు కావాలి
- డోర్నకల్ – మిర్యాలగూడ అలైన్‌మెంట్ మార్చాలి
- ఎస్‌సీఆర్ జీఎంను కోరిన జిల్లా ఎంపీలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మల్కన్‌గిరి – భద్రాచలం రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా వచ్చే ఏడాదిలోగా పాండురంగాపురం నుంచి సారపాక వరకు ట్రాక్ పనులు పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ కోరారు. రాబోయే బడ్జెట్‌ను దృష్టిలో ఉంచుకుని ఎంపీలతో రైల్వే జీఎం గురువారం సికింద్రాబాద్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామ్ నాయక్ మాట్లాడుతూ.. పాండురంగాపురం–సారపాక రైల్వే లైన్ పనులకు గత యూపీఏ– 2 ప్రభుత్వ హయాంలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చామని, అదే స్ఫూర్తితో ఇప్పటి ప్రభుత్వం ఏకంగా మల్కన్‌గిరి వరకు రైల్వేలైన్ నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. అయితే భద్రాచల క్షేత్రానికి ఉన్న ప్రాశస్త్యంతో పాటు ఇక్కడి పారిశ్రామిక అవసరాలను గుర్తించి సారపాక–పాండురంగాపురం సెక్షన్‌కు నిర్మాణ పనుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

అలైన్‌మెంట్ మార్చండి..

ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘురాం రెడ్డి మాట్లాడుతూ డోర్నకల్–మిర్యాలగూడ, డోర్నకల్– గద్వాల రైల్వే లైన్లతో ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతులకు అన్యాయం జరుగుతోంది జీఎం దృష్టికి తెచ్చారు. ఈ ప్రాంత రైతులు ఇప్పటికే జాతీయ రహదారులు, సీతారామ లెఫ్ట్ కెనాల్, భక్త రామదాసు లిఫ్ట్ ఇరిగేషన్ వంటి ప్రాజెక్టులకు భూములు ఇచ్చారని తెలిపారు. ఈ నేపథ్యంలో కొత్త రైల్వేలైన్ల విషయంలో రైతులకు నష్టం రాకుండా చూడాలని కోరారు. ఈ ప్రతిపాదిత రైల్వే లైన్‌ను డోర్నకల్, మన్నెగూడెం, అబ్బాయిపాలెం, మరిపెడ, మోతె, విష్ణుపురం మీదుగా మిర్యాలగూడెం వరకు నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి వరంగల్, మహబూబాబాద్ ఎంపీలు కడియం కావ్య, బలరామ్‌నాయక్ కూడా మద్దతు తెలిపారు. అలైన్ మార్చే అంశాన్ని పరిశీలించాలని మరో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కూడా విజ్ఞప్తి చేశారు.

మరో రైలు ఏర్పాటుచేయండి..

ప్రస్తుతం మణుగూరు నుంచి సికింద్రాబాద్‌కు రాత్రి వేళ మాత్రమే ఎక్స్‌ప్రెస్ రైలు ఉందని, దీనికి అదనంగా ఉదయం వేళ మరో రైలు నడిపించాలని బలరామ్ నాయక్ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం వారానికి నాలుగు రోజులు నడుస్తున్న మణుగూరు – బెళగావి ఎక్స్‌ప్రెస్‌ను డెయిలీగా మార్చాలని, ఇల్లెందుకు రైలును పునః ప్రారంభించే అంశాన్ని పరిశీలించాలని కోరారు. రైళ్లలో తినుబండారాలు అమ్ముకుంటూ జీవించే వారికి ఇచ్చే ఇజ్జత్ పాసులను 150 కి.మీ.కు పెంచాలన్నారు. గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు మహబూబాబాద్ స్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని, కరోనా ముందు తరహాలోనే నెక్కొండ, కేసముద్రం స్టేషన్లలో ప్రధాన రైళ్లను ఆపాలని అన్నారు.

భద్రాచలంలో ఎయిమ్స్ నిర్మించాలి..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు కూడలిగా ఉన్న భద్రాచలంలో ఎయిమ్స్ తరహా ఆస్పత్రిని నిర్మించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని ఎంపీ బలరాంనాయక్ కోరారు. నాలుగు రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంతాలకు కేంద్రంగా ఉన్న భద్రాచలం లేదా చర్లలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కచ్చితంగా ఒక పెద్దాస్పత్రి అవసరమని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నుంచి రక్షణ కల్పించేలా రూ.5,000 కోట్లతో గోదావరికి ఇరువైపులా కరకట్టలు నిర్మించాలని, రాష్ట్ర విభజన సమయంలో ఏపీలో కలిసిన నాలుగు మండలాలను తిరిగి తెలంగాణలో విలీనం చేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. ఈ అంశాలపై శుక్రవారం భద్రాచలంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసి వివరిస్తానని తెలిపారు.

విద్యా సామర్థ్యాలు పెంపొందించాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



సమావేశానికి హాజరైన ఎంఈఓలు, హెచ్‌ఎంలు

ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచన

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంచేందుకు ఉపాధ్యాయులు వంద శాతం కృషి చేయాలని, ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు తగు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు. కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో ఎంఈఓలు, కాంప్లెక్స్, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో మౌలిక వసతులపై దృష్టి పెట్టామని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పనులు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడానికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు నిధులు విడుదల చేశామని, పాఠశాలల పరిశుభ్రతతో పాటు ఇతర సామగ్రి కొనుగోలుకు మాత్రమే ఈ నిధులు వినియోగించాలని ఆదేశించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు చివరి రెండు నెలల్లో ప్రణాళికలు రచించడమే సరికాదని, మొదటి నుంచే ప్రణాళికాయుతంగా పిల్లలను చదివించి పరీక్షలకు సన్నద్ధం చేయాలని చెప్పారు. పాఠశాలల్లో ఔషధ మొక్కలతో పాటు ఇతర రకాల మొక్కలు నాటేలా ప్రధానోపాధ్యాయులు చేసిన కృషిని ఆయన అభినందించారు. త్వరలో పాఠశాల వ్యవసాయం అనే కార్యక్రమాన్ని కూడా తీసుకుంటామని, అందుకు ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల పిల్లలను ఇంటివద్ద రాత పనిని ప్రోత్సహించేందుకు నోట్ పుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరా చారి, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావు, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ.నాగరాజశేఖర్, జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ సమస్యలు ఆలకించండి..

గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు జిల్లా వాసుల విన్నపం

భద్రాచలం: జిల్లాలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేలా ప్రభుత్వానికి సూచనలు చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను జిల్లా వాసులు వేడుకుంటున్నారు. శుక్రవారం గవర్నర్ పర్యటన సందర్భంగా తమ సమస్యలు ఆయనకు వినిపించేందుకు కొంత సమయం కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

కొలిక్కిరాని విలీన సమస్య..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి ఉన్నత వ్యక్తులు భద్రాచలానికి వచ్చిన ప్రతీసారి విలీన గ్రామపంచాయతీల సమస్య అందరికీ గుర్తొస్తుంది. ఇది కేంద్ర ప్రభుత్వ స్థాయిలో రాజ్యాంగ పరిధిలోని సమస్య కావడమే దీనికి ప్రధాన కారణం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విభజన సమయంలో భద్రాచలంలో అంతర్భాగంగా ఉన్న పిచుకలపాడు, కన్నాయిగూడెం, యటపాక, గుండాల, పురుషోత్తపట్నం గ్రామాలను ఏపీలో విలీనం చేశారు. భద్రాచలంతో దశాబ్దాలుగా అనుబంధంగా ఉన్న తమ అభిప్రాయాలు తెలుసుకోకుండానే అన్యాయంగా ఏపీలో కలిపారని, సమస్యల విన్నవించుకోవాలంటే వంద కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని ఆయా గ్రామాల వారు వాపోతున్నారు. ఇక నాలుగు రాష్ట్రాల గిరిజనుల వైద్య సేవలకు దిక్కుగా ఉన్న భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మల్టీ స్పెషాలిటీ సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇక్కడ ఎయిమ్స్ తరహాలో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలన్నది ప్రధాన డిమాండ్. భద్రాచలం కేంద్రంగా టూరిజం హబ్ ఏర్పాటుకు అనేక అవకాశాలు ఉన్నా.. ఆచరణకు నోచుకోవడం లేదు. ఇక గిరిజనుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు నామమాత్రంగానే అందుతున్నాయి.దీంతో గిరిజనులకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. ఇలాంటి సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి, తమకు న్యాయం చేయాలని గవర్నర్‌ను పలువురు కోరుతున్నారు.

జిల్లాకు చేరుకున్న గవర్నర్

స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీ, పినపాక ఎమ్మెల్యే



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ పాటిల్ తదితరులు

బూర్గంపాడు: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ గురువారం జిల్లాకు చేరుకోగా, సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్ వద్ద ఘన స్వాగతం లభించింది. ఐటీసీకి చేరుకున్న గవర్నర్‌కు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజ్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, రామాలయ ఈఓ రమాదేవి తదితరులు గవర్నర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. భద్రాచలం ఆలయ అర్చకులు వేదాశీర్వాచనం చేశారు. గురువారం రాత్రి ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో బస చేసి, శుక్రవారం భద్రాద్రి రామయ్యను దర్శించుకోనున్నారు.

చెట్లు నరికితే చర్యలు తప్పవు

డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్



ప్లాంటేషన్‌ను సందర్శిస్తున్న డీఎఫ్‌ఓ తదితరులు

గుండాల: పోడు భూముల పేరుతో అడవుల్లో ఒక్క చెట్టు నరికినా, మూగ జీవాలను చంపినా కఠిన చర్యలు తప్పవని డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్ హెచ్చరించారు. గురువారం ఆయన ఇల్లెందు ఎఫ్‌డీఓ కోటేశ్వరావు, రేంజర్ నర్సింహరావు, సిబ్బందితో కలిసి గలబ ప్లాంటేషన్‌తో పాటు అడవులను సందర్శించారు. ప్లాంటేషన్‌ను నిరంతరం పర్యవేక్షిస్తుండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కాచనపల్లి, గుండాల రేంజ్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. పోడు భూముల పేరుతో ఎవరైనా చెట్లు నరికితే వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. అక్రమంగా కలప నరకడం, తరలించడంపై నిఘా పెట్టాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అడవులు, అటవీ ఉత్పత్తులపై అవగాహన కల్పించాలని సూచించారు. వన్యప్రాణులను కాపాడాలని, వేటగాళ్లపై నిఘా ఏర్పాటు చేయాలని అన్నారు. వన్యప్రాణులకు నీటి గుంతల్లో తాగునీరు ఉండేలా చూడాలన్నారు. పంటలు కోశాక రైతులు చెత్తను కాలుస్తారని, ఆ మంటలు అడవులకు అంటుకోకుండా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఉన్నత విద్యతోనే ఉత్తమ సమాజం

కళాశాల విద్య జేడీ రాజేందర్‌సింగ్



మాట్లాడుతున్న జేడీ రాజేందర్‌సింగ్

ఖమ్మం సహకారనగర్ /నేలకొండపల్లి: ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యే ఉత్తమ సమాజ స్థాపనలో కీలక భూమిక పోషిస్తుందని కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.రాజేందర్ సింగ్ తెలిపారు. ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాలలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో గురువారం సమావేశమైన ఆయన కళాశాలల్లో ప్రవేశాలు, మౌలిక వసతుల కల్పన, బోధన, పరీక్షల నిర్వహణ, విద్యార్థుల హాజరు పెంపుపై సూచనలుచేశారు. ఇటీవల అటానమస్ హోదా పొందిన కళాశాలలకు కావాల్సిన సదుపాయాలపై ఆరాతీశారు. తొలుత జేడీ నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రం, రామదాసు ధ్యాన మందిరాన్ని సందర్శించాక స్థానిక డిగ్రీ కాలేజీలో మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు అమలుచేసిన 'దోస్త్'కు మంచి స్పందన వచ్చిందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చదువుతో పాటు పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాళ్లు డాక్టర్ జకీరుల్లా, డాక్టర్ ఆలేటి పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా 'ఉపాధి' గుర్తింపు

- జిల్లాలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనుల ఎంపిక
- వచ్చే నెల వరకు గ్రామసభల్లో ఉపాధి పనుల ఆమోదం


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

చుంచుపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో వచ్చే ఏడాది(2025–26)లో జిల్లాలో చేపట్టాల్సిన ఉపాధి పనులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లాలో లక్ష్యాన్ని మించి ఉపాధి పనులు జరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించేందుకు డీఆర్డీఏ అధికారులు సన్నద్ధమయ్యారు. గాంధీ జయంతి నేపథ్యంలో ఈ నెల 2 నుంచి జిల్లా వ్యాప్తంగా ఉపాధి గ్రామసభలను నిర్వహిస్తున్నారు. ఉపాధిహామీ ఏపీఓలు, సాంకేతిక సహాయకులు, కార్యదర్శులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి కావాల్సిన పనులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచనల మేరకు ఈసారి మునగ తోటలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చేలా చొరవ తీసుకుంటున్నారు.

ప్రాధాన్యం ఇవ్వనున్న పనులు ఇవే

ఉపాధి హామీ పథకం కింద 266 రకాల పనులను చేపట్టవచ్చని అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో మాత్రం 39 రకాల అనుకూలమైన పనులకు అవకాశం కల్పించుకునే వీలుంది. వాటిలో ప్రధానంగా పంటచేలలో నీటి కుంటలు, కందకాల తవ్వకం, చెరువుల పూడికతీత, పశువులు, మేకలు పాకలు, పశుగ్రాసం పెంపకం, పండ్ల తోటలు, పొలం గట్లు, కాలువగట్లపై చెట్ల పెంపకం, వర్షపు నీటి మళ్లింపు కాలువలు, ఫామ్‌పాండ్స్ ఏర్పాటు, ఇంకుడు గుంతలు, చెక్ డ్యాములు, ఫిష్ పాండ్స్, కోళ్ల పౌల్ట్రీ షెడ్లు, బంజరు భూములకు సాగుకు యోగ్యంగా మార్చడం వంటి పనులను గుర్తిస్తున్నారు. ఇక సామాజిక పనులు సీసీ రహదారులు, మట్టిరోడ్లు, నర్సరీల నిర్వహణ, హరితహారం మొక్కల సంరక్షణ, గ్రామ పంచాయితీ, మహిళా సంఘాలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు, మల్టీ యూనిట్ టాయిలెట్స్, పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం, రూరల్ హట్‌లు, భవన నిర్మాణ సామగ్రి తయారీ, తాగునీటి తొట్లు, కేటిల్ షెడ్లు, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడం వంటివి గ్రామసభల్లో ఆమోదించుకోవచ్చు. ఈ గ్రామసభల్లో గ్రామస్తులు తమకు అవసరమైన పనులను ఎంపిక చేసుకునే వెసులుబాటు దక్కుతుంది.

నవంబర్ 30 వరకు గ్రామసభలు

పనుల గుర్తింపు కోసం నవంబర్ 30 వరకు ఉపాధి గ్రామసభలు నిర్వహిస్తారు. జిల్లా స్థాయి వార్షిక ప్రణాళిక 2025, జనవరి 21 వరకు ఆమోదం పొందుతుంది. 2025 జనవరి 31న రాష్ట్రస్థాయిలో ఆమోదం పొందాక మార్చి 31న లేబర్ బడ్జెట్ విడుదల చేస్తారు. జిల్లాలోని 22 గ్రామీణ మండలాల పరిధిలో 481 గ్రామ పంచాయతీలున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 2.23 లక్షల కుటుంబాలు జాబ్‌కార్డులు కలిగి ఉన్నాయి. వాటి పరిధిలో 4.59 లక్షల మంది కూలీలు పేరు నమోదు చేసుకున్నారు. ఈ ఏడాది జిల్లాలో 46.97 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 44.09 లక్షల పనిదినాలను పూర్తి చేశారు. ఈ ఏడాది జిల్లాలో 1,064 కుటుంబాలు 100 రోజుల పనిదినాలను పూర్తిచేసుకున్నాయి. గ్రామస్తులు, రైతు సంఘాలు, అధికారుల భాగస్వామ్యంతో క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పనులను గుర్తించే పనిలో ఉన్నారు.

అందరికీ పని కల్పించేందుకు కృషి



జిల్లాలో వచ్చే ఏడాదిలో చేపట్టబోయే ఉపాధి పనులను గుర్తించే ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి పక్కా ఉపాధి ప్రణాళికలను రూపొందిస్తాం. అడిగిన ప్రతి కూలీకి పని కల్పించేందుకు కృషి చేస్తాం. గ్రామాల్లో ఉపాధి నిధులను పూర్తి స్థాయిలో వినియోగించేలా చర్యలు చేపడతాం.

–ఎం.విద్యాచందన, డీఆర్డీఓ

చిరుతపులి పిల్ల సంచారం


చిరుతపులి పిల్ల పాదముద్రలను సేకరిస్తున్న అధికారులు

ఏన్కూరు: మండలంలోని రేపల్లెవాడ సమీపాన ఓ మిర్చితోటలో బుధవారం సాయంత్రం చిరుతపులి పిల్ల సంచరించింది. తోటకు కాపలా ఉన్న వ్యక్తి ఈ విషయాన్ని గమనించి రైతు శ్రీహరికి తెలిపాడు. దీంతో అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా డీఆర్‌ఓ శ్రీనివాస్, ఎఫ్‌బీఓలు దుగ్గిరాల శ్రీను, చందానాయక్, నర్సింహారావు గురువారం పరిశీలించి పాదముద్రలు సేకరించారు. అయితే, ఈ పాదముద్రలను చిరుతపులి పిల్లవిగా అనుమానం వ్యక్తం చేశారు. ఇటీవల ఏన్కూరు మండలానికి సరిహద్దుగా ఉన్న జూలూరుపాడు మండలంలో చిరుతపులి తిరిగినట్లు నిర్ధారించగా అది పిల్లలు పెట్టి ఉంటుందని, అవే తిరుగుతుంటాయనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈనేపథ్యాన రేపల్లెవాడ వాసులు ఆందోళన చెందుతుండగా అంతా అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు ప్రచారం చేస్తున్నారు.

అమ్మపాలెం వాసికి డాక్టరేట్


గుగులోత్ వెంకన్న

కొణిజర్ల: కొణిజర్ల మండలం అమ్మపాలెంకు చెందిన గుగులోత్ వెంకన్న అనంతపురంలోని జేఎన్‌టీయూ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కే.ఎఫ్.భారతి పర్యవేక్షణలో ఆయన 'టెక్స్ డాక్యుమెంట్ క్లస్టరింగ్ యూసింగ్ సెంట్రాయిడ్ అండ్ నైబర్‌హుడ్ అప్రోచెస్' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకన్నను గ్రామస్తులు అభినందించారు.

'మైనింగ్' అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన


అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): మేనేజ్‌మెంట్ ట్రెయినీ మైనింగ్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) సామ్యేల్ సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం పరిశీలించారు. వెరిఫికేషన్‌కు 70 మంది అభ్యర్థులు రావాల్సి ఉండగా 67 మంది మాత్రమే హాజరయ్యారు. అయితే వీరికి ముందుగా గతంలో ఎన్నడు లేని విధంగా ఐరిస్ పరీక్షలు నిర్వహించి పరీక్ష రాసింది ఈ అభ్యర్థే అనే నిర్ధారణకు వచ్చిన తర్వాత సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేశారు. మిగిలిన అభ్యర్థులకు ఈనెల 25న వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత సింగరేణి ప్రధానాస్పత్రిలో వైద్య పరీక్షలు చేస్తారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన కొందరు అభ్యర్థులు తమ మనోభావాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

ఎట్టకేలకు అధికారి ఉద్యోగం సాధించా



మా నాన్న మల్లయ్య కొత్తగూడెం ఏరియాలోని జీకేఓసీలో వేయింగ్ మిషన్ వద్ద పనిచేశారు. ఆయన తండ్రి వీకే–7లో గనిలో మజ్దూర్‌గా పనిచేశారు. నేను అండర్ మేనేజర్ ఉద్యోగానికి ఎంపికయ్యాను. సింగరేణి సంస్థ మా మూడు తరాలకు ఉపాధి కల్పిస్తోంది. మా నాన్న సింగరేణిలో పనిచేసి, కష్టపడి నన్ను చదివించారు. ఆయన శ్రమ వృథా కాకుండా నేను కూడా కష్టపడి చదవి కంపెనీ నిర్వహించిన పోటీ పరీక్షల్లో 7వ ర్యాంక్ సాధించా. – మనోజ్‌కుమార్, బీటెక్ మైనింగ్

చాలా సంతోషంగా ఉంది



సింగరేణి సంస్థలో అధికారి హోదా గల ఉద్యోగం పొందడం చాల సంతోషంగా ఉంది. తెలంగాణలో అతి పెద్ద కంపెనీ అయిన సింగరేణిలో అధికారి పోస్టు రావడం మామూలు విషయం కాదు. రోజుకు 14 గంటలు కష్టపడి చదువుకున్నా. మా నాన్న ఆశయాన్ని నెరవేర్చాను. సంస్థలో ఓవర్‌మెన్ ఉద్యోగం సంపాదించాలని మా నాన్న ఆశిస్తే అంతకంటే మరో రెండు స్టెప్పుల పై ఉద్యోగం సాధించి ఆయన కోరిక నెరవేర్చాను.

– రాజ్‌కుమార్, మైనింగ్ అభ్యర్థి

పంట నమోదును పరిశీలించిన అధికారులు

పెనుబల్లి: డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా పంటల నమోదు కార్యక్రమాన్ని పెనుబల్లి మండలంలో జిల్లా వ్యవసాయాధికారి ధనసిరి పుల్లయ్య, సత్తుపల్లి ఏడీఏ వి.శ్రీనివాసరెడ్డి గురువారం పరిశీలించారు. అలాగే, మండలంలోని పలు గ్రామాల్లో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేసి నిల్వలు, అమ్మకాలపై ఆరా తీసి సూచనలు చేశారు. ఏఓ ప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వంతెనను ఢీకొట్టిన ట్రాక్టర్


ప్రమాద దృశ్యం

దమ్మపేట: మారుజాతి కలప లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ వంతెనను ఢీకొట్టిన ఘటన మండల పరిధిలోని ఎర్రన్నపేట గ్రామ శివారులో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... బుధవారం అర్ధరాత్రి మండలంలోని గుర్వాయిగూడెం నుంచి ట్రాక్టర్‌లో పరిమితికి మించిన చింత చెట్టు కలపను ఏపీ రాష్ట్రానికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ ఎర్రన్నపేట గ్రామ శివారులో అదుపుతప్పి వంతెనను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్ భాగం రెండు ముక్కలు కాగా ట్రక్కులో ఉన్న కలప చెల్లాచెదురుగా పడిపోయింది.

మెడికల్ బోర్డ్‌కు 179 మంది హాజరు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో గురువారం మెడికల్ బోర్డు నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో 204 మందికి సమాచారం ఇవ్వగా, 179 మంది హాజరయ్యారు. వీరిని పరీక్షించిన వైద్యులు, శుక్రవారం మరోమారు పరీక్షల అనంతరం అన్‌ఫిట్‌పై నిర్ణయం వెలువరించనున్నారు.

నాలుగు దశాబ్దాల తర్వాత ఆత్మీయ కలయిక


సమ్మేళనంలో పాల్గొన్న 1984 బ్యాచ్ కానిస్టేబుళ్లు

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 1984లో ఎంపికైన కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనాన్ని గురువారం ఖమ్మంలో నిర్వహించారు. కానిస్టేబుళ్లుగా ఉద్యోగం ప్రారంభించి హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐ, ఎస్ఐ హోదాల్లో ఈ బ్యాచ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న వీరంతా నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకోవాలని నిర్ణయించి భేటీ అయ్యారు. 105 మందితో సివిల్ కానిస్టేబుళ్ల బ్యాచ్‌లో ప్రస్తుతం 41 మంది సర్వీస్‌లో ఉండగా, 39 మంది రిటైర్డ్ అయ్యారు. మరో 25 మంది కన్నుమూయగా వారి కుటుంబీకులను ఆహ్వానించి రోజంతా ఆత్మీయతంగా గడిపారు. ఈ సమావేశంలో మోహన్‌రావు, రామచంద్రరావు, రాయప్ప, శ్రీశైలం, రహీం, శ్రీనివాసులు, మాదల శ్రీనివాసరావు, పూనాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. – ఖమ్మంక్రైం

నిందితులు రిమాండ్‌కు తరలింపు

జూలూరుపాడు: హత్యకేసులో ఇద్దరు నిందితులను గురువారం పోలీసులు రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. ఎస్ఐ బి.రాణా ప్రతాప్ కథనం ప్రకారం.. బేతాళపాడు గ్రామ పంచాయతీ రాచబండ్లకోయగూడెం గ్రామానికి చెందిన కుంజా భిక్షంను ఈ నెల 21న అదే గ్రామానికి చెందిన కుంజా ప్రవీణ్‌కుమార్, మల్కం గంగయ్యలు గ్రామ శివారుకు తీసుకెళ్లి చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో కొట్టి చంపి చెక్ డ్యాంలో పడేశారు. మృతుడి సోదరుడు అర్జున్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. గురువారం నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

విప్పల సింగారంలో దొంగల హల్‌చల్

మణుగూరు టౌన్: మండల పరిధిలోని విప్పలసింగారం పంచాయతీలో బుధవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. దుండగులు విప్పలసింగారంలో ప్రధాన దారి పక్కనే నివసించే వల్లెపల్లి నాగాచారి ఇంటి పక్కనే ఉన్న పశువుల పాకలో ఉండే గేదెలకు కట్టిన తాళ్లు తొలగిస్తున్నారు. దీంతో అలికిడికి కేకలు వేస్తూ బట్టి నాగరాజు అనే వ్యక్తి వెంబడించాడు. దీంతో అతడి మొఖంపై దాడి చేసి పక్కనే కాల్వలోకి దూకి తప్పించుకున్నారు. ఇదే ప్రాంతంలో నాలుగు రోజుల క్రితం కూడా పశువులు దొంగిలించేందుకు యత్నించడంతో స్థానికులు ప్రతిఘటించారు. వారంలో రెండు సార్లు చోరీ యత్నాలు జరిగాయని, పోలీసులు గస్తీ పెంచాలని విప్పలసింగారం గ్రామస్తులు కోరుతున్నారు.

బంగారు ఆభరణాలు చోరీ

కారేపల్లి: ఇంటి తాళం పగలగొట్టిన దుండగులు బంగారం ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని చింతలతండా గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన భూక్యా బుజ్జి కుటుంబీకులు ఉదయం కూలి పనులకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటి తాళం పగలకొట్టి బీరువాలో దాచిన రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికొచ్చాక గమనించిన బుజ్జి ఫిర్యాదుతో కారేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

మునగ సాగుతో రైతులకు ప్రయోజనం

జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్

జూలూరుపాడు: మునగ సాగుతో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరతాయని జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్ అన్నారు. గురువారం వినోభానగర్ గ్రామంలో మునగ సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 10 వేల ఎకరాల విస్తీర్ణంలో మునగ సాగు చేపట్టాలని లక్ష్యం కాగా, జూలూరుపాడు మండలంలో 450 ఎకరాల్లో మునగ సాగయ్యేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. మునగ సాగుకు గుంతలు తవ్వడం, విత్తనాలు, మొక్కల సంరక్షణ, కూలీల ఖర్చును ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఎకరంలో 1000 మునగ మొక్కలు నాట వచ్చునని, ఆరు నెలల్లో కాయలు కోసి మార్కెట్‌లో అమ్ముకోవచ్చునన్నారు. ఎకరానికి సుమారు రూ.50,000 నుంచి రూ.75,000 నికర ఆదాయం వస్తుందన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ తాళ్లూరి రవి, ఎంపీఓ తులసిరామ్, ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి చరణ్ చరిత్, ఉపాధి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లాభాల పంట..

సుజాతనగర్: మునగ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్ అన్నారు. పాత అంజనాపురంలో గురువారం మునగ సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీఓ బారతి, ఏఓ జి.నర్మద రైతులు పాల్గొన్నారు.

నేడు కార్మికులకు లాభాల బోనస్


సింగరేణి కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): దీపావళి పండుగకు వారం ముందు కార్మికులకు లాభాల బోనస్ చెల్లించాలని తాము కోరడంతో సింగరేణి యాజమాన్యం స్పందించి ఈ నెల 25న ఇచ్చేందుకు అంగీకరించిందని ఏఐటీయూసీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతా రామయ్య, రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఒక్కో కార్మికుడికి రూ.93,750 చొప్పున బ్యాంక్ అకౌంట్లలో జమ చేయనుందని పేర్కొన్నారు. కార్మికులు ఈ నెలలో వచ్చిన డబ్బులను కుటుంబ అభ్యున్నతికి జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. కాగా 2022లో రూ.76,500 బోనస్ చెల్లించగా, 2023లో రూ.85,500 చెల్లించారు.

పెద్దమ్మతల్లి హుండీ ఆదాయం రూ.39.34లక్షలు


కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం నడుమ కొలువైన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. దేవాదాయ శాఖ అధికారి పి.బేల్‌సింగ్, ఈఓ ఎన్.రజనీకుమారి పర్యవేక్షణలో లెక్కించగా 132 రోజులకు గాను రూ.39,34,78 ఆదాయం నమోదైంది. అలాగే, వివిధ దేశాల కూడా కరెన్సీ కూడా లభ్యమైంది. ఇక మిశ్రమ వెండి, బంగారాన్ని తిరిగి హుండీలో వేసినట్లు ఈఓ తెలిపారు. కరూర్‌వైశ్య బ్యాంక్ మేనేజర్ మదన్ మోహన్, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు పాల్గొన్నారు.

శాశ్వత అన్నదానానికి విరాళం

శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో శాశ్వత అన్నదానానికి ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన ఎస్.మధు – యామిని రూ.1,11,116 విరాళాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఈఓ రజనీకుమారి అమ్మవారి శేష వస్త్రాలతో సన్మానించారు.

అధికంగా డబ్బులు వస్తాయనే ఆశతో..

యాప్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయిన పలువురు

సుజాతనగర్: అధికంగా డబ్బులు వస్తాయనే ఆశతో ఓ యాప్‌లో పెట్టుబడి పెట్టి పలువురు మోసపోయినట్లు తెలుస్తోంది. రూ.15 వేల రూపాయలు పెట్టుబడి పెడితే రోజూ రూ.540 చొప్పున ఏడాదిపాటు వస్తాయంటూ నమ్మబలికిన ఓ యాప్‌లో కొందరు పెట్టుబడి పెట్టారు. మండల పరిధిలోని రాఘవాపురం గ్రామానికి చెందిన సుమారు 150 మంది ఓ యాప్‌లో ఒక్కొక్కరూ రూ.15 వేల చొప్పున చెల్లించారు. వీరంతా రూ.20 నుంచి రూ.25 లక్షల రూపాయలు చెల్లించినట్లు తెలుస్తోంది. మొదట్లో కొందరికి ప్రతి రోజూ రూ.540 చొప్పున రావడంతో నమ్మిన చాలా మంది అదే తరహాలో పెట్టుబడి పెట్టారు. డబ్బులు అధికంగా సంపాదించవచ్చనే ఆశతో చాలా మంది బంగారు నగలు కూడా తాకట్టు పెట్టి పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది. నాలుగైదు రోజులుగా ఈ యాప్ పనిచేయకపోవడంతో బాధితులంతా మోసపోయినట్లు గుర్తించారు. మరో రూ.3,500 చెల్లిస్తే యాప్‌లో ఉన్న నగదు విత్ డ్రా చేసుకోవచ్చనే సమాచారం యాప్‌లో వస్తోందని, అసలే మోసపోయామని, ఈ నగదు కూడా చెల్లిస్తే డబ్బులు వస్తాయో రావోనని బాధితులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై సుజాతనగర్ ఎస్సై జుబేదాబేగంను వివరణ కోరగా.. ఇలాంటి యాప్‌లు నమ్మవద్దని, మోసపోయిన బాధితులు 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామం వద్ద ఈ నెల 9న జరిగిన రోడ్డు ప్రమాదంలో గుండాల మండలం శంభునిగూడం గ్రామానికి చెందిన ఈసం సమ్మయ్య (28) తీవ్రంగా గాయపడ్డాడు. ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. వైద్యుల సూచన మేరకు బుధవారం ఇంటికి చేర్చగా, గురువారం సమ్మయ్య ఇంటివద్దే మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఈసం వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కొమరారం ఏఎస్సై నాగరాజు తెలిపారు.

క్లుప్తంగా

జేకే ఓసీలో అధికారుల పరిశీలన


వ్యూ పాయింట్ నుంచి పరిశీలిస్తున్న సివిల్ సర్వీసెస్ ట్రెయినీ అధికారులు

ఇల్లెందు: సింగరేణి జేకే ఓసీలో గురువారం సివిల్ సర్వీసెస్ ట్రెయినీ అధికారులు పర్యటించి పరిశీలించారు. గురువారం ఇల్లెందు జేకే ఓసీ వ్యూ పాయింట్ నుంచి క్వారీని పరిశీలించారు. రోజు వారీ బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలు అడిగి తెలుసుకున్నారు. రవాణా, ఓబీ, బ్లాస్టింగ్, లోడింగ్ పనులు, పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన చర్యపై ఆరా తీశారు. డంప్ యార్డుపై ఉన్న ప్లాంటేషన్, సైట్ ఆఫీస్‌లను సందర్శించారు. సివిల్ సర్వీసెస్ ట్రెయినీ అధికారుల బృందంలో తేజస్విని(ఐఈఎస్) విపుల్ సింఘాల్(ఐఎఫ్ఎస్), అనిత మీనా(ఐఆర్ఎస్), అల్తమస్ ఘజీ(ఐఏఎస్) ఉన్నారు. వారి వెంట సింగరేణి అధికారులు కృష్ణమోహన్, నాగేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.

కిమ్స్ ఆస్పత్రిలో వైద్యశిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలోని కిమ్స్ ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మెదడు, వెన్నుముక, నరాల చికిత్సకు సంబంధించి శిబిరంలో 87 మంది పరీక్షలు చేయించుకున్నారని ఆస్పత్రి బాధ్యులు భీమిరెడ్డి, బాబురెడ్డి తెలిపారు. ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల ప్రజలు శుక్రవారం కూడా కొనసాగే వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'సింగరేణి నియామకాల్లో రిజర్వేషన్ ఉల్లంఘన'

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో చేపట్టిన నియామకా(ఎక్స్‌టర్నల్)ల్లో హారిజంటల్ రోస్టర్ రిజిష్టర్ నెపంతో 33శాతం రిజర్వేషన్ ఉల్లంఘన జరుగుతోందని బీఎంఎస్ నాయకుడు పి.మాదవనాయక్ విమర్శించారు. కొత్తగూడెంలో గురువారం ఆయన మాట్లాడుతూ కొన్ని కేటగిరీల్లో మూడు ఖాళీలు ఉండడం తక్కువని చెప్పారు. కానీ ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల భర్తీలో ప్రతీ కేటగిరీలో మూడు లేదా అంతకంటే ఎక్కువ నోటిఫైడ్ పోస్టులు ఉన్నప్పుడు మాత్రమే మహిళా అభ్యర్థులకు ఒక పోస్టు కేటాయిస్తామని చెప్పడం సరికాదన్నారు. ఈ నిర్ణయంతో ఓసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూసీ మహిళా అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. ఈ విషయాన్ని సింగరేణి యాజమాన్యం పునఃసమీక్షించి మహిళా అభ్యర్థులకు రాజ్యాంగపరంగా రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కల్లు గీసేందుకు తాటి చెట్టెక్కి..

గుండెపోటుతో కిందపడి గీత కార్మికుడి మృతి


బాబూరావు గౌడ్ (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: రోజులాగే కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కిన ఓ గీత కార్మికుడు మృతి చెందిన ఘటన గురువారం అశ్వారావుపేటలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని గౌడ బజారుకు చెందిన ఆరేపల్లి బాబూరావు గౌడ్ (40) ఉదయం తాటి చెట్టు ఎక్కి, కల్లు గీసి కిందకు దిగుతున్న క్రమంలో ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యాడు. దీంతో అదుపుతప్పి చెట్టుపై నుంచి కిందపడి మృతి చెందాడు. మృతుడు గౌడ సంఘం అశ్వారావుపేట మండల అధ్యక్షుడిగా, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తగా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య దేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు యూఎస్ ప్రకాశ్‌రావు, సత్యవరపు సంపూర్ణ, గోవింద్ తదితరులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. కుటుంబీకులకు సానుభూతి వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు...

మరో యువకుడికి తీవ్రగాయాలు

దుమ్ముగూడెం : మండలంలోని మహదేవపురం – చిన్నార్లగూడెం గ్రామాల మధ్య గల కోడిగింపు టర్నింగ్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కొత్తనారాయణరావుపేటకు చెందిన పాయం జంపన్న(20), కొమరం వీర్రాజు ద్విచక్ర వాహనంపై లక్ష్మీనగరం పని నిమిత్తం వచ్చారు. అనంతరం కొత్తనారాయణరావుపేట తిరిగి వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో పాయం జంపన్నకు తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. వీర్రాజుకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 ద్వారా భద్రాచలం ఆస్పత్రికి తరలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043



● పుప్పొడి నేత

పరాగ మంజరి

పూల అందాలను చూసి మైమరచిపోవడం మనకు తెలిసిందే!
వాటిలో దాగున్న పరాగ రేణువుల అందం చూస్తే... ప్రకృతి ఒడిలో మనకు తెలియని ఇన్ని అద్భుతాలు దాగున్నాయా అని ఆశ్చర్యపోవాల్సిందే!
అత్యంత సంక్లిష్టంగా ఉండే ఆ పరాగ రేణువుల నిర్మాణపు అందాన్ని చూడటమే కాదు, వాటిని టెక్స్‌టైల్ డిజైన్స్‌లో తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నది హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ ఎమ్మెస్సీ విద్యార్థిని శివాని నేత చిలుకూరి.
అత్యంత సూక్ష్మంగా కనిపించే ఈ అద్భుతాలను 'పరాగ మంజరి'గా మనకు పరిచయం చేస్తున్నది.
'దేశానికి గుర్తింపు తెచ్చే లక్షలాది యునిక్ డిజైన్స్‌ని పరిచయం చేయబోతున్న ఆనందంలో ఉన్నాను' అంటున్న శివాని నేత తన ప్రాజెక్ట్ విశేషాలను ఇలా మన ముందుంచింది..

''పరాగ అంటే పుప్పొడి – మంజరి అంటే డిజైన్. సంస్కృతం నుంచి తీసుకున్న ఈ పదాలను మా ప్రాజెక్టుకు పెట్టాం. బీఎస్సీ అగ్రికల్చర్ చేయాలనుకుని, కుదరక బోటనీ సబ్జెక్ట్ తీసుకున్నాను. ఉస్మానియా యూనివర్శిటీలో ఎమ్మెస్సీ బోటనీ చేస్తున్నాను. నాకు డ్రాయింగ్ కూడా తెలుసు అని మా బోటనీ ప్రొఫెసర్ విజయ భాస్కర్ రెడ్డి సర్ నాకు ఈ డిజైనింగ్ టాపిక్ ఇచ్చారు. దానిని ఇలా మీ ముందుకు తీసుకు రాగలిగాను.

లక్షలాది మోడల్స్

పరాగ రేణువులను రెండు విధాలుగా మైక్రోస్కోప్ చేశాను. లైట్ మైక్రోస్కోపీలో ఫ్లవర్ స్ట్రక్చర్, సెమ్(స్కానింగ్ ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్)లో పుప్పొడి రేణువులను స్కాన్ చేశాను. భూమిపైన లక్షలాది మొక్కలు, వాటి పువ్వులు వేటికవి భిన్నంగా ఉంటాయి. ఇక వాటిలోని పరాగ రేణువులు మరింత భిన్నంగా ఉంటాయి. మందార, వేప, తులసి, తిప్పతీగ, తుమ్మ, అర్జున, ఉల్లి పాయ, కాకర, ఆరెంజ్, జొన్న, మొక్క జొన్న, ఖర్జూరం, దోస పువ్వు... ఇలా దాదాపు 70 రకాల పుప్పొడి రేణువులను స్కాన్ చేసి, ఆ స్కెలిటన్ నుంచి మోటిఫ్స్‌ను వెలుగులోకి తీసుకువచ్చాను. ఈ అందమైన పరాగ రేణువుల నుంచి మోటిఫ్స్ డిజైన్స్‌గా తీసుకు రావడానికి నాలుగు నెలల సమయం పట్టింది.

పేటెంట్ హక్కు

ఇప్పటి వరకు సాఫ్ట్‌వేర్‌లోనే టెక్స్‌టైల్ ప్యాటర్న్‌ని తీసుకున్నాను. క్లాత్ మీదకు తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నాను. మాది నేత కుటుంబమే. నేను చేసిన ఈ ప్రింట్స్ క్లాత్స్ మీదకు తీసుకురావచ్చని నిర్ధారణ చేసుకున్నాం. కాటన్, పట్టు, సీకో మెటీరియల్ మీదకు మోటిఫ్స్ ప్రింట్స్ చేయచ్చు. నేతలోనూ డిజైన్స్ తీసుకోవచ్చు. ఎంబ్రాయిడరీ కూడా చేయచ్చు. మేం ముందు టీ షర్ట్ పైన ప్రింటింగ్



శివాని నేత

ప్రయత్నం చేశాం. ఇంకా మిగతా వాటి మీదకు ప్రింట్స్ చేయాలంటే టెక్స్‌టైల్ ఇండస్ట్రీ మద్దతు అవసరం అవుతుంది. బ్లాక్ ప్రింట్ చేయాలన్నా .. అందుకు తగిన వనరులన్నీ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ముందుగా పేటెంట్ హక్కు పొందేవరకు వెళ్లింది. దీనిని ఒక స్టార్టప్‌గా త్వరలో ప్రారంభించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

టెక్స్‌టైల్ రంగం మద్దతుతో...

ప్రకృతిలో కళ్లకు కనిపించేవి లైట్ మైక్రోస్కోపిక్ ద్వారా నలభై వరకు పిక్చర్స్ తీసుకుంటే, స్టెమ్ ద్వారా మరికొన్ని సాధించాం. కంప్యూటర్‌లో వియానా దేశం నుంచి పోలెన్ గ్రెయిన్స్ స్కెలిటన్ స్ట్రక్చర్ నుంచి కొన్ని తీసుకున్నాం. మన దేశానికి వేల సంవత్సరాల నుంచి అద్భుతమైన టెక్స్‌టైల్ డిజైనింగ్ కల్చర్ ఉంది. కలంకారీ, ఇకత్ పోచం పల్లి, గొల్ల భామ, రాజస్థాన్‌లో బాందినీ, గుజరాతీలో లెహెరియా, కాశ్మీర్ ఎంబ్రాయిడరీ ఎప్పటి నుంచో ఉన్నాయి. అలాగే 'పరాగ మంజరి' మన దేశానికే వన్నె తెచ్చేలా తీసుకురావాలన్నది నా ప్రయత్నం. దీనిని తెలంగాణ ప్రభుత్వం టెక్స్‌టైల్ శాఖకు అందించి, వారి సపోర్ట్ తీసుకొని, ఈ వర్క్‌ను వెలుగులోకి తీసుకురావాలనుకుంటున్నాం'' అని శివాని నేత చిలుకూరి తెలియజేశారు.

– నిర్మలారెడ్డి,
'సాక్షి' ఫీచర్స్ ప్రతినిధి

లక్ష ప్యాటర్న్స్

ఒక్కో చెట్టు పువ్వుకు ఒక్కో ప్రత్యేకమైన పరాగ రేణువులు ఉంటాయి. ఈ పరాగ రేణువుల మోడల్స్ నుంచి కొన్ని లక్షల ప్యాటర్న్స్ టెక్స్‌టైల్ రంగంలోకి తీసుకురావచ్చు. వీటిని పట్టు, కాటన్, సిల్క్, బెడ్ షీట్స్.. ఇలా ప్రతి క్లాత్ మీదకు తీసుకురావచ్చు. ఈ ప్రాజెక్ట్ తయారు చేస్తున్నప్పుడు ప్రపంచంలో ఎవరైనా ఇలా చేశారా.. అని శోధించాను. కానీ, ఎక్కడా మాకు ఆ సమాచారం లభించలేదు. అందుకే, పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేశాం. ఈ ప్యాటర్న్స్ వస్త్ర డిజైన్ పరిశ్రమల్లో గణనీయమైన ప్రభావం చూపుతాయి.



– డాక్టర్ అల్లం విజయ భాస్కర్‌రెడ్డి,
అసోసియేట్ ప్రొఫెసర్,
బోటనీ డిపార్ట్‌మెంట్, ఉస్మానియా యూనివర్శిటీ

స్త్రీ శక్తి



మన్నిదా బాను

ప్రాణం నిలిపి

మన్నిదా బాను మంగుళూరులోని కద్రి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్. ఈమధ్యే కొత్తగా ఉద్యోగంలో చేరారు. అక్టోబర్ 23 తెల్లవారు జామున 3.40 కి ఆ స్టేషన్ కి కాల్ వచ్చింది. అక్కడికి దగ్గర్లోని పాలిటెక్నిక్ కాలేజీ సెంటర్లో పెద్ద ఆక్సిడెంట్ అయింది. పికప్ వెహికల్, కంటైనర్ ట్రక్కు డీ కొట్టుకున్నాయి. ఇదీ ఆ కాల్. వెంటనే మన్నిదా తన స్కూటీ పై ప్రమాద ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆమె వెళ్ళేటప్పటికి ఆ వాహనాలు తుక్కు తుక్కు అయి ఉన్నాయి. ఒక వ్యక్తి రక్తపు మడుగులో చావు బతుకుల మధ్య కొట్టుకుంటున్నాడు. ఆ రెండు వాహనాలలో ఒకదాని క్లీనర్ అతను. మన్నిదా అతడి పరిస్థితిని గమనించారు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే అతడిని అతి కష్టమ్మీద లేపి, తన స్కూటర్ పై నేరుగా ఆ దగ్గర్లోని ప్రైవేట్ ఆసుపత్రికి మోసుకెళ్లారు. అతడి ప్రాణాలని నిలబెట్టగలిగారు.

ఆమె టైమ్ సైన్స్, ఆమె వేగం, ఆమె ధైర్యం, ఆమెలోని కారుణ్యం, ఆమె యూనిఫామ్.. అన్నీ పంచభూతాల్లా ఒకటై ఆ వ్యక్తి ప్రాణాలను కాపాడాయనే అనుకోవాలి. అదే కనుక.. పోలీస్ కాకుండా ఒక మామూలు వ్యక్తి ఎవరైనా అంతలా గాయపడిన వారిని తీసుకెళితే ప్రైవేటు హాస్పిటల్స్ చేర్చుకుని ఉండేవా?! 'మేం అడ్మిట్ చేసుకోడానికి లేదు. ఇది పోలీస్ కేస్..' అని ఉండేవి.

'వాయు వేగంగా స్పందించి ఒకరి ప్రాణాన్ని నిలబెట్టిన కద్రి స్టేషన్ మహిళా పోలీస్ కానిస్టేబుల్ మన్నిదా బానుకు' అభినందనలు అంటూ తెల్లారగానే మంగుళూరు సిటీ పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ ట్వీట్ పెట్టారు. మంగుళూరు ఈస్ట్ పోలీస్ స్టేషన్ నుంచి కూడా మన్నిదాకు ప్రశంసలు అందాయి.

డ్యూటీ మైండెడ్ మాత్రమే అయి ఉంటే ఘటనా స్థలానికి వెళ్ళగానే ఫార్మాలిటీస్ లో పడి ఉండేవారు మన్నిదా. కానీ ఆమె అలా చేయలేకపోయారు. ఆమెలోని మానవతా హృదయం.. ఉద్యోగ విధి విధానాలను దాటి మరీ స్పందించింది. అందుకు 'తగిన శిక్ష' ఏదైనా ఉందంటే.. అది ప్రమోషనో, ప్రశంసాపత్రమో తప్ప మరొకటి అవుతుందా?! మన్నిదా మాత్రం.. 'నేను చేసింది ఏముందీ..!' అని చిరునవ్వుతో అంటున్నారు.. తనపై కురుస్తున్న అభినందనల జల్లులలో తడిసి ముద్ద అవుతూ.



రీనా వర్గీస్

ప్రాణాలకు తెగించి

సాహసాన్ని వెన్నెముకగా ధరించే వాళ్లకు అసాధ్యం ఉండదు. హై–రిస్క్ అనేది ఉండదు.

ఈ విషయాన్ని మరోసారి అక్షరాలా నిరూపించింది పైలట్ రీనా వర్గీస్. అడవిలో, అత్యంత ప్రతికూల పరిస్థితులలో ప్రాణాపాయంలో ఉన్న జవాన్‌ను ఆస్పత్రికి తరలించింది.

రీనా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన కొత్తలో... 2009లో సీనియర్ పోలీసు అధికారులను తీసుకు వెళుతున్న హెలికాప్టర్‌ను మావోయిస్టులు కూల్చివేశారు. తాను చేస్తున్న ఉద్యోగం ఎంత రిస్క్ అనేది అర్థం చేసుకోవడానికి ఆ సంఘటన రీనాకు ఉపయోగపడింది.

తాజా విషయానికి వస్తే...

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో కమాండోలు, మావోయిస్టులకు మధ్య ఎనిమిది గంటల పాటు జరిగిన భీకరమైన ఎదురుకాల్పుల్లో ఒక కమాండో తీవ్రంగా గాయపడ్డాడు. మావోయిస్టుల రాకెట్ దాడులకు అవకాశం ఉన్న ఆ ప్రమాదకరమైన పరిస్థితుల్లో గాయపడిన కమాండోను అక్కడి నుంచి తరలించడం అంటే ప్రాణాలను పణంగా పెట్టడమే.

ఉన్నతాధికారుల నుంచి సమాచారాన్ని అందుకున్న రీనా వర్గీస్ తన ప్రాణాన్ని లెక్క చేయకుండా హన్స్ హెలికాప్టర్‌తో రంగంలోకి దిగింది. కో–పైలట్‌కు కమాండ్స్ అందజేసి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో హెలికాప్టర్‌ను వీలైనంత వరకు దించి కిందికి దూకింది. తాడు సహాయంతో గాయపడిన కమాండోను హెలికాప్టర్‌లోకి తీసుకువచ్చింది. 30 నిమిషాలలో గడ్చిరోలికి అక్కడి నుండి నాగ్‌పూర్ తరలించింది. మూడు బుల్లెట్లు తగిలిన కమాండోకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో బి.టెక్ చేసిన రీనా వర్గీస్ గతంలో ఎన్నో ముఖ్యమైన రెస్క్యూ ఆపరేషన్‌లలో పాల్గొంది. కోవిడ్ మహమ్మారి సమయంలో బాధితులను లక్షద్వీప్ నుంచి కొచ్చికి తరలించే రెస్క్యూ ఆపరేషన్‌లలో చురుగ్గా పాల్గొని ప్రశంసలు అందుకుంది.

తాళపత్ర కళ



బాల త్రిపుర సుందరి



అవసరం ఒక ఆవిష్కరణకు దారి వేసింది. ఆర్థిక అవసరాలే తనను హ్యాండీక్రాఫ్ట్ కళాకారిణిగా తీర్చిదిద్దాయని చెప్పారు బాల త్రిపుర సుందరి. తాటి ఆకులతో గృహోపకరణాలు, అలంకరణ వస్తువులు తయారు చేస్తారామె. వీటి తయారీలో మహిళలకు శిక్షణనిస్తారు కూడా. తాటి ఆకు కళారూపాల తయారీలో యాభై ఏళ్ల అనుభవం ఆమెది.

ఒక నిర్ణయం జీవితాన్ని మార్చేసింది!

త్రిపుర సుందరికి 75వ సంవత్సరం. ఆమెది తూర్పుగోదావరి జిల్లాలో ఓ కుగ్రామం. చదువుకు నోచుకోని త్రిపుర సుందరి 1972లో ముంబయికి వెళ్లి హస్తకళాకృతుల తయారీలో సర్టిఫికేట్ కోర్సు చేశారు. అక్కడ నేర్పించిన కళారూపాలతోపాటు తన క్రియేటివిటీతో మరికొన్ని రూపాలను తయారు చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో హస్తకళాకృతుల ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెట్టారు. ప్రస్తుతం హైదరాబాద్, నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజాలో పామ్ క్రాఫ్ట్ కళాకృతులను ప్రదర్శిస్తున్నారు.



పనిలోనే ఆనందం

''మా ఊరిలో తెలిసిన వాళ్ల ద్వారా ముంబయిలో శిక్షణ కోర్సు గురించి తెలిసింది.. మూడు నెలల కోర్సు, బస భోజన వసతులు వాళ్లే ఏర్పాటు చేస్తారని చెప్పారు. చదువు లేదు, భాష ఇబ్బందవుతుందేమోనని భయంతోనే వెళ్లాను. కానీ అక్కడ తెలుగు వాళ్లు కూడా ఉండడంతో ఇబ్బంది కలగలేదు. క్రమంగా హిందీలో చెప్తున్న విషయాలు అర్థం కాసాగాయి. కోర్సు పూర్తయిన తర్వాత మా ఊరికి వచ్చి, నిడదవోలులో ఉన్న తాటిబెల్లం ఫెడరేషన్ లో ట్రైనర్‌గా ఉద్యోగంలో చేరాను. బదలీ మీద 1983లో హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కి వచ్చాను.

ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్‌తో కూడా పని చేశాను. ఆ ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాత ఇప్పుడు కూకట్‌పల్లి, హౌసింగ్ బోర్డులో మా ఇంటి దగ్గర నాకు నచ్చిన కళారూపాలు అల్లుకుంటూ, ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెడుతున్నాను. వీటితోపాటు తుక్కుగూడలోని నీరా యూనిట్‌లో శిక్షణనిస్తున్నాను. బంధువులు, స్నేహితులు ఇంకా పని చేయడం ఎందుకని అడుగుతుంటారు. పిల్లల బాధ్యతలు పూర్తయ్యాయి, నేను పని చేయకపోతే అడిగేవాళ్లు కూడా లేరు. కానీ నాకు పని చేయకుండా కూర్చుని తినడం ఇష్టం ఉండదు. ఆరోగ్యం బాగున్నప్పుడు పని మానేయడం ఎందుకు?'' అంటూ స్టాల్‌లో ఆమె బొమ్మల ధరలు అడుగుతున్న వారికి బదులివ్వడంలో మునిగిపోయారామె.

– విఎమ్‌ఆర్
ఫోటోలు: ఎస్‌ఎస్ ఠాకూర్



సూజీ బ్రెడ్

హెల్దీ డైట్



కావలసినవి: **బొంబాయి రవ్వ** – ఒకటిన్నర కప్పులు; **ఇన్‌స్టంట్ ఈస్ట్** – టీ స్పూన్; **చక్కెర పొడి**– టేబుల్ స్పూన్; **ఉప్పు** – పావు టీ స్పూన్; **పాలు** – 3 టేబుల్ స్పూన్‌లు; **నీరు** – అర కప్పు; **నూనె** – 2 టేబుల్ స్పూన్‌లు; **వెన్న** – టీ స్పూన్; **సీడ్స్** – 3 టేబుల్ స్పూన్‌లు (బాదం పలుకులు, పిస్తా, గుమ్మడి గింజలు, డ్రైఫ్రూట్ చిప్స్ వంటివి).

తయారీ

- రవ్వను మిక్సీజార్‌లో మెత్తగా పొడి చేసి ఒక పాత్రలో వేయాలి. అందులో ఈస్ట్, చక్కెర పొడి, ఉప్పు వేసి కలపాలి.
- అందులో నీరు, పాలు, నూనె వేసి బీటర్‌తో బాగా కలిపి పది నిమిషాల సేపు పక్కన ఉంచాలి.
- అడుగు చదరంగా ఉన్న పాత్రకు వెన్న రాసి అందులో పై మిశ్రమాన్ని వేసి చపాతీల పిండిని కలిపినట్లు చేత్తో 15 నిమిషాల సేపు మర్దన చేయాలి. కొద్దిగా పిండిని తీసుకుని వేళ్లతో సాగదీస్తే పలచబడుతూ సాగాలి. అలా వచ్చే వరకు మర్దన చేసి వేరొక పెద్ద పాత్రకు వెన్న రాసి అందులో పెట్టి మూత పెట్టాలి. ఆ పాత్రను గంట సేపు వెచ్చని ప్రదేశంలో ఉంచాలి, పిండి రెండింతలవుతుంది.
- ఏడంగుళాలు, నాలుగు అంగుళాల కొలతల లోఫ్ పాన్‌కు వెన్న రాసి అందులో బ్రెడ్ పిండిని పెట్టి అర గంట సేపు కదిలించకుండా ఉంచాలి. ఈ కొలతలతో చేసిన పిండి పాన్‌లో సగానికి మాత్రమే వస్తుంది. అరగంట సేపటికి పిండి పరిమాణం రెండింతలవుతుంది. ఆ మిశ్రమం లోఫ్ పాన్‌లో పూర్తిగా అమరే లోపు పిండి మీద పాలను అద్ది ఆ పైన బాదం ఇతర గింజలను చల్లాలి.
- ఈ లోపు ప్రెషర్ కుకర్‌ను వేడి చేయాలి. లోఫ్ పాన్‌ను కుకర్‌లో అమర్చిన తర్వాత మూతపెట్టి 25 నిమిషాల సేపు చిన్న మంట మీద ఉంచాలి.



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

ఒంటె బుక్ చేయాలి ఓటిపి నంబర్ ఎంత?

ఊబర్, ఓలాలో ఆటోనో స్కూటరో కారో బుక్ చేయొచ్చు. వస్తుంది. కాని ఒంటెను బుక్ చేయొచ్చా? దుబాయ్‌లో ఇద్దరు ఆడవాళ్లు ఎడారిలో తప్పిపోయారు. ఊబర్‌లో వెతికి ఒంటెను బుక్ చేశారు. ఒంటె ఐదు నిమిషాల్లో వచ్చింది. ఎక్కారు. ఇంటర్‌నెట్‌లో సరదా దుమారం రేపుతున్న ఈ కథనం వెనుక యదార్థం ఏమిటి?



పల్లెటూరులో ఉన్నప్పుడు ఎడ్లబండి, నది ఒడ్డున పడవ, అడవిలో ఏనుగు, కొండ దారిలో గాడిద, ఎడారిలో ఒంటె ఇలా ఊబర్ ద్వారానో ఓలా ద్వారానో బుక్ చేసే వీలుంటే ఎంత బాగుంటుంది? ఏమో ఆ రోజులు కూడా వస్తాయేమో. రెండు రోజుల క్రితం అలాంటి విషయాన్నే చూపి లోకాన్నంతా ఆకట్టుకుంది ఒక వీడియో. దుబాయ్‌లో ఇద్దరు మహిళలు 'మేము ఎడారిలో తప్పిపోయాం. ఊబర్‌లో ఒంటె ఉందేమో చూద్దాం' అని ఫోన్‌ని స్క్రోల్ చేస్తే ఒంటెను బుక్ చేసే ఆప్షన్ ఊబర్‌లో కనిపించింది. వారిలోని ఒక మహిళ ఒంటెను బుక్ చేయగానే దీపక్ అనే వ్యక్తి ఐదు నిమిషాల్లో ఒంటెతో ప్రత్యక్షమయ్యాడు. ఇంకేముంది... ఆ మహిళల ఆనందానికి హద్దే లేదు. వారిలో ఒకామె ఒంటెనెక్కి 'ఇది భలే ఉంది' అనుకుంటూ ఇంటిదారి పట్టింది. ఈ వీడియో ఇంటర్‌నెట్‌లో రాగానే లక్ష లైకులు సంపాదించుకుంది. సరదా వ్యాఖ్యల్ని కూడా. 'ఓటీపీ నంబర్ ఎంత?', 'దుబాయ్‌లో అంతే', 'నంబర్ ప్లేట్ ఎక్కడ'... ఇలా. నిజానికి ఇది నిజంగా జరగలేదు. 'జెట్‌సెట్ దుబాయ్' అనే ట్రావెల్ సంస్థ ఊబర్‌తో కలిసి చేసిన ప్రమోషనల్ వీడియో. దుబాయ్‌లో అయినా సరే ఊబర్ ఒంటె సర్వీస్‌ను ఇవ్వదు. కాని 'ఏటీవీ' (ఆల్ టెర్రయిన్ వెహికిల్)ను బుక్ చేసుకోవచ్చు. దుబాయ్‌లో ఊబర్ బ్లాక్ (హైఎండ్ కార్లు), గ్రీన్ (ఎలక్ట్రిక్ కార్లు), ఎల్‌యుఎక్స్ (లగ్జరీ కార్లు) రైడ్‌కు పంపుతుంది. మొత్తం మీద ఈ యాడ్ కొత్త ఆలోచనలు రేకెత్తించింది. కార్లు, బైకులు, ఆటోలకు ఉన్న ఇలాంటి సర్వీసులు ఇకపై ప్రాంతాన్ని బట్టి మారితే బాగుందనిపించింది.

బ్యూటిప్స్

మెరిసే మేని ఛాయను కాపాడుకోవాలంటే..



- తక్షణ తాజాదనం కోసం రోజ్ వాటర్ లేదా దోసకాయ రసంతో మేనికి మర్దనా చేసి, ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి.
- పచ్చి పాలను కాటన్ బాల్‌తో అద్దుకొని, ముఖానికి రాయాలి. 10 నిమిషాల పాటు అలాగే ఉంచి కడిగేయాలి. పాలలో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది, ఇది చర్మాన్ని సున్నితంగా ఉంచడంతో పాటు శుభ్రపరుస్తుంది.
- చర్మంపై నుంచి సహజ నూనెలను పోకుండా ఉండటానికి చర్మతత్వానికి సరిపోయే తేలికపాటి, క్లెన్సర్‌ని ఉపయోగించాలి.
- ఓట్‌మీల్‌లో తేనె, కొద్దిగా నీళ్లతో కలిపి పేస్ట్ చేయాలి. మృత చర్మ కణాలను తొలగించడానికి, పోర్స్‌ను శుభ్రం చేయడానికి సున్నితంగా స్క్రబ్ చేయాలి.
- ప్రతిరోజూ కలబంద జెల్‌ను రాసి, మృదువుగా మర్దనా చేయాలి. దీని వల్ల చర్మం నునుపుగా, తేమగా ఉంటుంది.
- టేబుల్ స్పూన్ తేనెను, టేబుల్ స్పూన్ పెరుగుతో కలపాలి. దీన్ని ముఖానికి అప్లై చేసి, 15 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ చర్మాన్ని కాంతిమంతం చేస్తుంది.
- సగం అరటిపండును మెత్తగా చేసి, టీస్పూన్ తేనెతో కలపాలి. చర్మం మృదువుగా, మెరుస్తూ ఉంటుంది.
- కొద్దిగా గ్రీన్ టీని కాచి, చల్లబరచాలి. ఈ నీటిని దూదితో అద్దుకుంటూ, మేనికి పట్టించాలి. ఎండకు కమిలిన చర్మం తాజాగా మారుతుంది.